6_6.qxd 1/22/2026 11:31 PM Page 1



# జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన గౌస్

**బల్లికురవ, జనవరి 22, ప్రభాతవార్త**




మండలంలోని వి.కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి, జాతీయ స్థాయి ప్రతిభ పోటీలలో పాల్గొంటూ ఎప్పటికప్పుడు తమ ప్రతిబను చాటుతూనే ఉంటారు. గురువారం ప్రకాశం జిల్లా స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో జరిగిన స్పెల్ బి పోటీలలో ఎస్కే గౌస్ మూడవ స్థానాన్ని పొందారు. సంబంధిత అధికారులు ప్రశంస పత్రాన్ని మెమొంటోను గౌస్‌కు అందజేశారు. స్థానిక పాటశాలలోని అధ్యాపక బృందం గౌస్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ప్రతినిధిగా దమ్ము అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు సంఘాల లావాదేవీలపై అవగాహన అవసరం

**బల్లికురవ, జనవరి 22, ప్రభాతవార్త**






గ్రామీణ ప్రాంతాలలోని పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం తమకు అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ కుటుంబ ఆర్థిక ప్రగతిని ఇనుమడింప చేసుకునేందుకు ఎప్పటికప్పుడు వినూత్న పథకాలను ప్రవేశపెడుతుందని ఏపీఎం రాజారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం రెండవ రోజు జరిగిన మండల మహిళా ఈ నారి సీఆర్పీ వీఓఏల శిక్షణ సమావేశంలో మాట్లాడారు. నిధుల దుర్వినియోగంతో పాటు రుణాలు అందుకుంటున్న అన్ని విభాగాలలోనూ ఎప్పటికప్పుడు తమ ఆర్థిక ప్రగతిని బేరీజు వేసుకోవాలన్నారు. నిధుల నిర్వహణలో అవకతవకలకు అవకాశం లేకుండా సభ్యులందరికి అవగాహన సంఘం ప్రగతికి దోహదం చేస్తుందన్నారు. అనెక్సర్ 2 ఫార్మెట్‌లో ఉన్న పొదుపు సంఘాల సంబంధిత అంశాల గురించి, సమావేశాలు నిర్వహణ, గ్రూపు పుస్తకాలు నిర్వహణ, సమావేశంలో జరిగిన లావాదేవీలు దగ్గర అంశాల గురించి వివరించారు. సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే సమావేశాలకు ఎంత మంది హాజరైంది. ముఖ నమోదు, జియో ట్యాగింగ్, పొదుపు వివరాలు, తాము చెల్లించింది ఎంత, నిల్వ ఉన్న నిధులు ఎన్ని, కొనసాగే సభ్యులకు ప్రత్యేకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు పేరయ్య, డేవిడ్, ప్రమీల సిబ్బంది పాల్గొన్నారు.

# మలినేనికి కరణం ఘన నివాళి

**బల్లికురవ, జనవరి 22, ప్రభాతవార్త**



ఒంగోలు పట్టణానికి చెందిన ప్రముఖ షుగర్ వ్యాధి వైద్యులు మలినేని శ్రీనివాసరావు దశదిన కర్మ కార్యక్రమం గురువారం జరిగింది. సుందరయ్య భవన్ రోడ్డు, రోడ్డులోని ఆయన నివాసానికి చేరుకున్న కరణం.. శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక నేతలు పాల్గొన్నారు.

## గత వైసీపీ పాలనలో ఆగిపోయిన ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల పనులు

- నియోజకవర్గంలో విద్యాశాఖ మంత్రిగా కొనసాగిన కనీసం కళాశాలకు ఒరిగిందేమిలేదనే సర్వత్రా విమర్శలు
- కళాశాల భవనంతో పాటు వసతి గృహాలు అందుబాటులోకి వస్తేనే ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రకాశం, మార్కాపురం జిల్లాలకే తలమాణికంగా మారుతుంది
- కూటమి ప్రభుత్వంలో ఊపందుకున్న పనులు

**యర్రగొండపాలెం జనవరి 22, ప్రభాతవార్త**



యర్రగొండపాలెంలో వినుకొండ రోడ్డు నందు 10 ఎకరాలకు పైగా విశాలమైన స్థలంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో 7 ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలను మంజూరు చేస్తే అందులో భాగంగా వెనుకబడ్డ ప్రాంతమైన యర్రగొండపాలెంకు ఒక కళాశాల మంజూరు చేసింది. 2014లో ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలతో పాటు బాలికలకు, బాలురకు వేరు వేరుగా వసతి గృహాలు సైతం నెలకొలిపే విధంగా 12 కోట్ల రూపాయల నిధులను రూసా ద్వారా మంజూరు జరిగింది. టెండర్ దక్కించుకున్న గుత్తేదారుడు ఏపీఈడబ్ల్యూఐడీసీ వారి నేతృత్వంలో పనులను ప్రారంభించారు. 2019 వచ్చే వరకు భవన నిర్మాణాలను దాదాపుగా పూర్తి చేశారు. అయితే అప్పటికే 8 కోట్లకు పైగా నిధులను ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. ఆ పాఠశాల వసతి గృహాలను కేటాయించిన గుత్తేదారులకు బిల్లులు చెల్లించక పనులు నిలిచిపోయాయి. బిల్లులు ఆలస్యం కావడం ఎస్టిమేషన్ కాస్ట్ పెరగడంతో గుత్తే దారుడు ముందుకు రాక సగంలో పాఠశాల నిర్మాణపు పనులు ఆగిపోయాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిమూలపు సురేష్‌కు అనూహ్యంగా మంత్రి పదవి దక్కడం అందులో విద్యాశాఖ మంత్రి కావడంతో ఈ డిగ్రీ కళాశాల రూపు రేఖలు మారుతాయని విద్యార్థులు, యువత ఇక్కడి ప్రజలు భావించాఉ. కానీ విద్యాశాఖ మంత్రిగా ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఆయన వల్ల ఒరిగిందేమి లేదని సర్వత్రా విమర్శలు ఉన్నాయి. అయితే 2019లో అసంపూర్తిగా ఉన్న కళాశాల భవనాలలోనే కాలేజీ ప్రారంభించినప్పటికి విద్యాశాఖ మంత్రిగా కళాశాల అభివృద్ధికి సహకరించాల్సి న పరిస్థితులు ఉన్నప్పటికి అంతగా శ్రద్దను చూపక అశ్రద్ధ చేయడంతో జిల్లాలోనే తలమాణికంగా నిలవాల్సి న కళాశాల నేడు వసతులలేమితో నిర్మాణాల వరకే కళాశాల మిగిలిపోయింది. జిల్లా నుంచే విద్యార్థులు కళాశాలలో చేరినప్పటికి వసతి గృహాలు లేని కారణంతో చాలా మంది దూర ప్రాంతం పేద విద్యార్థులు వెనుతిరిగి వెళ్ళిపోయినట్లు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 12 కోట్ల నిధులతో మిగిలి ఉన్న 2 కోట్ల 63 లక్షల రూపాయల పనులను దక్కించుకున్న గుత్తేదారుడు పనులను ప్రారంభించడం జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన ఈ మోడల్ డిగ్రీ కళాశాల నిర్మాణపు పనులు పున:ప్రారంభం కావడం సుభసూచికంగా విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ నిధులతో కాలేజీ భవనం సర్వవసతులతో పూర్తి చేసే అవకాశమున్న ఈ నిధుల నుంచి 40 లక్షలు వసతి గృహాల ఆధునికరణకు కేటాయించడం పట్ల ప్రభుత్వ కళాశాలకు ఆ నిధులు సరిపోవనే మాట అధికారుల నుంచి వస్తుంది. వసతి గృహాలు లేకుండా డిగ్రీ కళాశాల పూర్తి అయిన దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చేరుతానే నమ్మకమైతే లేదని విద్యార్థి సంఘ నాయకులు తెలుపుతున్నారు.

**కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ నాయుడు వివరణ :**

ఈ విషయంపై ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర నాయుడు మాట్లాడుతూ వసతి గృహాలకు సరిపడా నిధులు మంజూరు జరిగితే ఈ కళాశాల భవనంతో పాటు వసతి గృహాలు అందుబాటులోకి వస్తే జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చే ఆస్కారం ఉందని, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల జిల్లాకే తలమానికంగా నిలుస్తోందని వసతి గృహాలు లేని కారణంతో విద్యార్థుల సంఖ్య పెరగడం లేదని పేర్కొన్నారు.

# విద్యుత్ ఘాతంతో యువకుడు మృతి

**యర్రగొండపాలెం, జనవరి 22, ప్రభాతవార్త**



పొలంలో ఓ రైతుకు సంబంధించిన మోటారు కాలిపోవడంతో బోరులోని పైపులను మినీ ట్రాక్టర్ క్రేన్ సహాయంతో పైకి లాగుతుండగా విద్యుత్ ఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన యర్రగొండపాలెం మండలం గురిజేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. యర్రగొండపాలెం ఎస్సై పి.చౌడయ్య తెలిపిన వివరాల ప్రకారం గురిజేపల్లి గ్రామానికి చెందిన కందుల పిచ్చిరెడ్డి(23) గ్రామంలోని ఓ రైతుకు చెందిన మిర్చి పొలంలో బోరు మోటారు కాలిపోవడంతో ఆ బోరు మోటారు పైపులను తన క్రేన్ ద్వారా పైకి లాగే క్రమంలో పైన ఉన్న విద్యుత్ వైర్లను చూసుకోకపోవడంతో వైర్లకు తగిలిన పైపులకు విద్యుత్ రావడంతో పైపులు పట్టుకున్న పిచ్చిరెడ్డి విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**వలేటివారిపాలెం, జనవరి 22, ప్రభాతవార్త**



వలేటివారిపాలెం మండల పరిధిలోని బొంతవారిపాలెం, శ్రీనివాస ఐటీ కాలేజీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు జిల్లాలోని తెనాలి మండలంలో పెద్ద రావూరి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతని వయసు సుమారు 23 సంవత్సరాలు ఉండవచ్చని, శాఖవరం గ్రామానికి పనులు కోసం వచ్చినట్లు పోలీసు సిబ్బంది తెలియజేశారు.

# ఈదుమూడిలో పశువైద్య శిబిరం

**నాగులుప్పలపాడు, జనవరి 22, ప్రభాతవార్త**



మండలంలోని ఈదుమూడి గ్రామంలో గురువారం పశుఆరోగ్య శిబిరం పశువైద్యాధికారిణి కే.జాస్మిన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు ఎన్.వెంకటేశ్వర్లు, నాగులుప్పలపాడు మండల సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు స్థానిక పశుపోషకులను ఉద్దేశించి మాట్లాడుతూ పశువుల భీమా పథకాన్ని ఉపయోగించుకుని, మీ పశువులన్నింటికి భీమా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. నాగులుప్పలపాడు మండల సహాయ సంచాలకులు మాట్లాడుతూ గోకులం పథకాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 700 గొర్రెలకు నట్టల నివారణ మందును అందించారు. ఈ కార్యక్రమంలో గర్భకోశ వ్యాధులకు చికిత్స, చూడి పరీక్షలు, పశువులకు, దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు వల్ల భావి జీవితం అంధకారం

**బల్లికురవ, జనవరి22, ప్రభాతవార్త**



మానవ జీవితంలో మత్తు పదార్థాల వినియోగం మనిషి జీవితాన్ని ఏ విధంగా అంధకారమయం చేస్తుందో ప్రముఖ వైద్యులు వై.హనుమంతరావు విద్యార్థులకు వివరించారు. గురువారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం, దుష్పరిణామాలు గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో డ్రగ్స్‌కు అలవాటు పడితే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఒక సారి ఈ దురలవాటుకు బానిస అయితే దాని నుండి బయటకు రావడం చాలా కష్టమని విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తుపై ఎంతో ఆశ పెట్టుకుంటారని, తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చటమే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు పోవాలన్నారు. విద్యార్థి దశలో ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టమైనా ఇష్టంతో దానిని చేరటమే ధ్యేయంగా ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావులు డ్రగ్స్ వినియోగం వల్ల తలెత్తే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు.

# ఎన్టీఆర్ ఆశయాలే టీడీపీ బాట

- టీడీపీ పార్టీ కాదు.. ప్రజా ఉద్యమమే
- అధినేత చంద్రబాబుపై నమ్మకంతో ప్రజల మద్దతు
- టీడీపీ భావజాల శిక్షణలో ఎమ్మెల్యే ఏలూరి

**మార్టూరు, జనవరి22, ప్రభాతవార్త**



పేదలసంక్షేమం, తెలుగు జాతి గౌరవంకోసం ఎన్టీఆర్ చూపిన బాటలోనే టీడీపీ ముందుకు సాగుతోందని, ఆయన ఆశయాలే తెలుగుదేశం పార్టీకి మార్గదర్శకమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలోని టీడీపీజాతీయ కార్యాలయంలో మండలపార్టీ అధ్యక్షులకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆశయాల సాధనకే పార్టీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. విలువలు, శ్రామికుల కృషి, సామాన్యుడి ఆకాంక్షలను ప్రతిబింబించే ప్రజా ఉద్యమమే టీడీపీ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం, భావజాలం, చరిత్రపై విస్తృతంగా వివరించారు. పసుపు జెండా శుభం– సంపదలకు ప్రతీక అని, పార్టీ గుర్తులైన గుడిసె, నాగలి, చక్రం రైతు – శ్రామికుల కృషిని సూచిస్తాయని, సైకిల్ సామాన్యుడి పురోగతికి, ఆశయ సాధనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ రామారావు తెలుగుదేశం పార్టీని కేవలం రాజకీయ పార్టీగా కాకుండా తెలుగు ఆత్మ గౌరవ ఉద్యమంగా ప్రారంభించారని గుర్తు చేశారు. అప్పటి వరకు ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమైన రాజకీయాల్లో అట్టడుగు వర్గాలు, వృత్తి నిపుణులు, విద్యా వేత్తలకు నాయకత్వ అవకాశాలు కల్పించింది టీడీపీపేనని స్పష్టం చేశారు. జీఎంసీ బాలయోగి, కింజరపు ఎర్రన్నాయుడు వంటి నాయకులతో పాటు కేసీఆర్, రేవంత్‌రెడ్డి వంటి అనేక మంది నాయకులు టీడీపీ వేదికపైనే ఎదిగి తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని ఏలూరి తెలిపారు. 1982లో ఎన్టీఆర్ చేపట్టిన చైతన్య రథయాత్ర తెలుగు రాష్ట్ర రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ల అనే ఎన్టీఆర్ సిద్ధాంతం కూలీలు, రైతులు, మహిళలు, వెనుకబడిన వర్గాల ఆశయాలను కేంద్రంగా చేసుకున్న ప్రజా తాత్వికంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ అభివృద్ధితో పాటు జాతీయ బాధ్యతను సమన్వయం చేసే పార్టీగా టీడీపీ ప్రత్యేక గుర్తింపును సాధించిందని ఏలూరి పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు దారి చూపే నాయకత్వాన్ని అందించడంలో టీడీపీ ముందుందని, సమాజ సేవకు అంకితభావంతో పని చేసే కేడర్ పార్టీకి ప్రధాన బలమని అన్నారు. ప్రభుత్వంపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ శిక్షణా శిబిరంలో పార్టీ నేతలు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## తాళ్లూరు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నాగార్జునరెడ్డి

**తాళ్లూరు, జనవరి 22, ప్రభాతవార్త**



తాళ్లూరు గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడిగా నుసుం నాగార్జునరెడ్డిను నియమిస్తూ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు,ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి ప్రకటించారు. గురువారం దర్శి పార్టీ కార్యాలయంలో గ్రామంలోని నాయకులతో చర్చించి ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ తనను గ్రామపార్టీ అధ్యక్షుడుగా నియమించిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి,జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు,పదవి వచ్చేందుకు కృషిచేసిమండల, గ్రామ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి,మాజీ ఎంపీపీ పోశం మధుసూదనరెడ్డి,మండల అధ్యక్షుడుతూము వెంకటసుబ్బారెడ్డి,మాజీ జడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చార్లెస్ సర్జన్,నాయకులు గూడాగోపాల్‌రెడ్డి, కొర్రపాటివిష్ణు, కోట కృష్ణారెడ్డి,నాగుళ్ళ వెంకట్రావు, సంగు కొండారెడ్డి, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు గ్రూపుల బలోపేతమే లక్ష్యం

**తాళ్లూరు, జనవరి 22,ప్రభాతవార్త**



స్వయం సహాయక గ్రూపులను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈనారీలు, సీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఎం పి. దేవరాజు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి పది మహిళా స్వయం సహాయక గ్రూపులకు ఒక ఈనారీని నియమిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సంఘంలో 25 గ్రూపుల కంటే ఎక్కువగా ఉంటే ముగ్గురు ఈనారీలు, ఇద్దరు సీఆర్పీలు పని చేస్తారని చెప్పారు. వీరు గ్రూపు సభ్యులు ఆర్థిక లావాదేవీలపై పూర్తి సమాచారం సేకరించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలు, రుణాల మంజూరుకు చర్యలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, సీసీలు ఐ. మోహన్‌రావు, కోటేష్‌బాబు పాల్గొన్నారు.

## నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 13వ వర్ధంతి వేడుకలు

**ఒంగోలు కల్చరల్ , జనవరి 22, ప్రభాతవార్త**



నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 13వ వర్ధంతి వేడుకలను అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పరిషత్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినీ చరిత్రలో నవశకానికి నాంది పలికారని అన్నారు. సుమారు 255 సినిమాల్లో నటించి భారత ప్రభుత్వంచే పద్మ విభూషణ్, సినీ రంగంలో ప్రతిష్టాత్మకమైన దాదా ఫాల్కే అవార్డు అందుకున్నారని అన్నారు. తెలుగు సినీ పరిశ్రమలకు ఏఎన్నార్, ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య మాట్లాడుతూ అక్కినేని మీద ఉన్న అభిమానంతో సంస్థను స్థాపించి కొత్త కూరగాయల మార్కెట్ రోడ్ లో విగ్రహాన్ని స్థాపించడం జరిగిందని అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ సివిఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ కి అక్కినేని అవార్డు2026 ప్రదానం చేస్తున్నామని అన్నారు. సంస్థ గౌరవాధ్యక్షులు సీహేచ్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సినీ రంగంలో ఆయన పోషించిన పాత్రలు అజరామరంగా నిలిచాయని కొనియాడారు.దేవదాసు, ప్రేమనగర్ చిత్రాలలోని పాత్రలు ఆయన మాత్రమే చేయగలిగినవని అన్నారు. ఈకార్యక్రమంలో అక్కినేని నాగేశ్వరరావు అభిమానులుఓరుగంటి ప్రసాద్,సింగరాజు శ్రీనివాసరావు,ఉలిచి వేద ప్రకాష్, మురళీకృష్ణ, తన్నీరు నాగరాజు, ఒగిరాల శంకర్, బ్రహ్మారెడ్డి, సత్యనారాయణ, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



**లింగసముద్రం, జనవరి 22, ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామంలో ఉచిత పశుఆరోగ్య శిబిరం పశువైద్యాధికారి వి.రమణయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ వ్యాధుల పట్ల పశువులు, మేకలు, గొర్రెలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి అన్నారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాలలో రైతులు పశువుల వ్యాధులను తెలియపరిచి వ్యాధి నివారణకు మందులు, టీకాలు వాడుకోవాలన్నారు. వ్యాధులు పట్ల అధికారులను సంప్రదించి సలహాలతో మందులు వాడాలని రైతులకు ఆమె వివరించారు. జరిగే పశు ఆరోగ్య శిబిరాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, రమేష్, చౌడయ్య, పాండు రంగారావు,వినోద్,నాయకులు పొలిమేర చిన నాగిరెడ్డి,నీలం బ్రహ్మారెడ్డి,కేసంరెడ్డి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మై ఇండియా మై ఓట్ థీమ్ నియోజకవర్గ స్థాయిలో పోటీలు

**యర్రగొండపాలెం, జనవరి 22, ప్రభాతవార్త**



ఈ నెల 25న ఓటర్ల దినోత్సవాన్ని పురష్కరించుకుని యర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయిలో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కుపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఎస్సే రైటింగ్, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికంగా ఉండే వివిధ విద్యా సంస్థల సహకారంతో విజయవంతంగా నిర్వహించబడినట్లు వారు పేర్కొన్నారు. పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఓటు హక్కు ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన పౌరులు అనే అంశాల మీద వివిధ పోటీల ద్వారా వారు వ్యక్తపరిచారని తెలిపారు. ఈ పోటీలలో నెగ్గిన వారికి టోపిలు, టీ షర్టులు, సర్టిఫికేట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎంఈఓలు మల్లు నాయక్, మస్తాన్ నాయక్, భాస్కర్, ఇందిరా ప్రసాద్ విజయ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్నికల విభాగ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు వెల్లడించారు.

## ఆంగ్లబాషా పోటీలో అమలనాధునిపాలెం విద్యార్థులు

**కందుకూరు జనవరి 22, ప్రభాతవార్త**




' విభా మరియు లీప్ ఫర్ వర్డ్' అనే ఎన్జీవో సంస్థలు సమగ్రశిక్ష కార్యక్రమంతో కలిసి నిర్వహించిన ఆంగ్లబాషాసామర్థ్యపోటీలలో కందుకూరు పట్టణంలోని అమలనాధునివారి పాలెం విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈసంస్థలు ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ పోటీలలో ఈ పాఠశాల విద్యార్థులతోపాటు సుమారు 311 పాఠశాల నుంచి పాల్గొన్నారు. మండల, జిల్లా, జోనల్ స్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్‌పోటీలలో 4వ తరగతి బాలిక షేక్ షైనీ ఎంపికైంది. ఈమెకు గుంటూరు హిందూకళాశాలలో గురువారం ధృవపత్రం అందచేసినట్లు ఉపాధ్యాయుడు వై.కోటేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా 5వతరగతి వై.ప్రేమకుమారి,ఎస్ జస్వంత్, 4వతరగతి టి.మణిదీప్,3వ తరగతి చెందిన ఆకాష్‌లు సైతం ఆన్‌లైన్‌లో ప్రతిభ కనపరిచారు. వీరికి ఆన్‌లైన్ ధృవపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా సంబందిత ఉపాధ్యాయిని పి.శారదాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 2నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఆంగ్లబాషా సామర్థ్యాలు పెంపొందించుటకు ఆన్‌లైన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వర్డ్ పవర్ చాంపియన్‌షిప్‌ప్రోగ్రాం కింద రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగా చదవడం,రాయడం,స్పెల్లింగ్,పదాలఅర్థాలు,ఆలోచనశీలత తదితర ఆంగ్లబాషా సామర్థ్యాలపై విద్యార్థుల అవగాహనను పరిశీలించు నిమిత్తం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు శారదాదేవి తెలిపారు. ఇందుకు హెచ్ఎం సుభాషిణి సదరు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను అభినందించారు.

# రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం

**మార్టూరు, జనవరి 22, ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, ఇన్నర్ వీల్ క్లబ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో మార్టూరులోని రాజుపాలెం రోడ్డు వద్ద శ్రీ సాయి బాలాజీ కళ్యాణ మండపం నందు 513 మంది ఆడ పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం రోటరీ డిస్ట్రిక్ట్ 3150, 3011 ఈ రెండు డిస్ట్రిక్ట్‌లు కలిసి ప్రాజెక్టు శక్తి అనే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కృష్ణవేణి నర్సింగ్ కాలేజీ నరసరావుపేటలో ఫైనల్ ఇయర్ చేస్తున్న వారి సహకారంతో ఈ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి, కేఎస్ ఆర్ కే ప్రసాద్, వనిత, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు,కార్యదర్శి చెరుకూరి నాగేశ్వర రావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, ప్రాజెక్టు ఆర్గనైజర్ జాష్టి వెంకట మోహన్‌రావు, సర్వీస్ ప్రాజెక్టు కొర్రపాటి సుబ్రహ్మణ్యం, ఈవెంట్ డైరక్టర్ఈశ్వర్‌ప్రసాద్,మాజీ అధ్యక్షులు, రోటరీ మెంబర్స్, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ జాస్తి అనురాధ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, స్కూల్ టీచర్స్ వచ్చి ఇలాంటి కార్యక్రమాలు ఎక్కువ మందికి ఏర్పాటు చేయగలరని కోరారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారికి సహాయ సహకారాలు అందించిన వారు కాకోలు వెంకటేశ్వర్లు, కృష్ణవేణి నర్సింగ్ కాలేజీ చైర్మన్ శేషగిరిరావు, చెరుకూరి నాగేశ్వరరావు, షేక్ అబ్దుల్ రెహమాన్, జాస్తి అనురాధలు ఆర్థికంగా సహకరించారు. ఈ కార్యక్రమానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం భోజన సౌకర్యం కల్పించారు.

## పోలినేనిపాలెంలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు



**వలేటివారిపాలెం జనవరి 22, ప్రభాతవార్త**
అపరిశుభ్రత అనారోగ్యానికి దారితీస్తుందని పోలినేనిపాలెం సర్పంచ్ అనుమోలు అమరేశ్వరి అన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చర్య తీసుకోవాలని ఆమె అధికారులుకు సూచించారు. ఇందుకు సహకరించాలని ఆమెప్రజలకు విజ్ఞప్తిచేశారు. గురువారం స్ధానిక ఈవోఆర్డీ నారాయణరావు నేతృత్వంలో గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేకచర్యలు చేపట్టారు. మురుగునీటి కాలవల్లో నిలిచిపోయిన వ్యర్థాలను తొలగించారు. ప్రధాన కూడళ్లలో పారిశుధ్యం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లుతోపాటు పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

**- ఎస్సై ఎం.మురళి**



**దర్శి, జనవరి 22, ప్రభాతవార్త**
దర్శి మండలంలో ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని దర్శి ఎస్సై ఎం.మురళి అన్నారు. దీనిలో భాగంగా అలాంటి ప్రదేశాలను గుర్తించి అక్కడ మున్సిపాలిటీ పంచాయతీ లోకల్ ప్రజలతో కలిసి ఆ ప్రదేశాలని శుభ్రం చేయడం జరిగింది. బహిరంగ ప్రదేశాల్లో ఎవరు మద్యం సేవించరాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలి

**- వ్యవసాయ శాఖ ఏడీఈ కే.బాలాజీనాయక్**



**ముండ్లమూరు, జనవరి22, ప్రభాతవార్త**
మండలంలోని ముండ్లమూరు, పసుపుగల్లు గ్రామాలలో సహాయ వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీ నాయక్ రబీ 2025-26 లో సాగు చేసిన పంటలను నమోదు చేసి ఈ పంట పక్రియను పర్యవేక్షించారు. రబీ 2025-26 పంట కాలంలో పంటలను సాగు చేస్తున్న రైతులందరూ తమ పంటలను ఈ పంట నందు గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన శాఖ సహాయకులు ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఈ పక్రియ ద్వారా ప్రభుత్వం వారు రైతులకు అందించే పథకాలకు అర్హులవుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏ.తిరుమలరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కే.వీరాంజనేయులు, వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టం బిగించిన ఎన్‌ఏపీ ఏఈ హనుమాన్ బాబు




**ముండ్లమూరు, జనవరి 22, ప్రభాతవార్త**
మండలంలోని బృందావనం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బృందావనం తండా గ్రామంలో వాటర్ ట్యాంకు ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టం గురువారం బిగించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఈ హనుమాన్ బాబు మాట్లాడుతూ దీని వలన ప్రతి ఇంటికి క్లోరినేషన్ ద్వారా నీటి సరఫరా అవుతుంది. బృందావనం తండా గ్రామంలో 100శాతం కుళాయిలు ఇవ్వడం జరిగింది. దీనికి అయ్యే ఖర్చు రూ.20వేలు మాత్రమే. ముండ్లమూరు మండలంలో మొదటగా బృందావనం తండాలో చేపట్టడం జరిగింది. దీనిని ప్రతి గ్రామ పంచాయతీ వారు సందర్శించి అనుసరించాల్సిందిగా కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఏపీ సిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞాపకార్థ కూడికలో పాల్గొన్న నాయకులు



**ముండ్లమూరు, జనవరి 22, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలం ఉమామహేశ్వర పురం ఎస్సీ కాలనీలో వైసీపీ కార్యకర్త ఎలిగందల నాగరాజు తల్లి జ్ఞాపకార్థ కూడికలో ముండ్లమూరు మండల జడ్పీటీసీ తాతపూడి మోజస్ రత్నరాజు, మండల ఎస్సీ సెల్ నాయకుడు గోపనబోయిన శ్రీనివాసరావు, జిల్లా ప్రచార కార్యదర్శి పాలెపోగు దగ్లస్, జిల్లా ఎస్సీ కార్యవర్గ సభ్యులు తాతపూడి శాంతకుమార్, స్థానిక నాయకులు నంబూరు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## దర్శిలో దగ్ధమైన లారీ



**దర్శి, జనవరి22, ప్రభాతవార్త**
దర్శి మండలం తూర్పుచౌటపాలెం గ్రామ పొలాల్లో ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని లారీ తగలబడింది. వరికోత మిషన్‌ను పొలంలో దింపి పక్కన పార్కింగ్ చేసే సమయంలో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. దీంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే లాగి పూర్తిగా దగ్ధమైంది.

## రెండవ రోజుకు చేరుకున్న ఈనారి సభ్యుల ప్రత్యేక శిక్షణ



**సంతనూతలపాడు, జనవరి 22, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని వెలుగు కార్యాలయం లో ఈ నారి సభ్యుల ప్రత్యేక శిక్షణ గురువారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. సభ్యులకు దశల వారీగా ఈనెల 21వ తేదీ నుండి ప్రారంభమైన ప్రత్యేక శిక్షణ 23వ తేదీ వరకు జరగనుంది. మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 21, 22వ తేదీల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 21, 22వ తేదీల్లో మండలంలో 140 మంది ఈ నారి సభ్యులకు మన డబ్బులు, మన లెక్కలపై యాప్ ద్వారా ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ఆర్థిక లావాదేవీలు ఆన్‌లైన్లో నమోదు చేయించడం కాకుండా వారి గ్రూపు పుస్తకాలను రాసి, వారి అప్పులు వసూళ్లు, పొదుపులు నిల్వలు అప్పు నిల్వలు ఎంత ఉన్నాయి, తదితర వాటిపై ఈ యాప్ ద్వారా సభ్యులకు వాయిస్ మెసేజ్ ద్వారా వినిపించి అవగాహన కల్పించాలని ఏపీఎం టి.బాబురావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలను ఈ నారి సభ్యులు సద్వినియోగపరుచుకోవాలని ఏపీఎం బాబురావు కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు పి.రామాంజనేయులు, సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్.చెంచులక్ష్మి, వి.శ్రీనివాసులు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ మహిళలకు కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ

**సంతనూతలపాడు, జనవరి 22, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్ద గల జిల్లా స్థాయి మహిళా ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జే.రవితేజ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 15 నుండి 45 సంవత్సరాల లోపు గల నిరుద్యోగ మహిళలు దీనిని సద్వినియోగపరుచుకోవాలని ఆయన పేర్కొన్నారు. వివరాల కొరకు మొబైల్ నెంబరు 9963005209 ను సంప్రదించాల్సిందిగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ యాదవ్ కోరారు.

## నిడమానూరులో పొగాకు బ్యారెన్ దగ్ధం

**- రైతులకు రూ.7 లక్షలు ఆర్థిక నష్టం - వివరాలు తెలిపిన రైతు డాక అంజిరెడ్డి**




**నాగులుప్పలపాడు, జనవరి 22, ప్రభాతవార్త**
అగ్ని ప్రమాదం జరిగి రెండు జంట పొగాకు బ్యారెన్‌లు దగ్ధమై రైతుకు రూ.7లక్షలు నష్టం వాటిల్లిన సంఘటన గురువారం నాగులుప్పలపాడు మండలంలోనిబి.నిడమానూరు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.గురువారం ఉదయం ప్రమాదవశాత్తు మొద్దు గొట్టంపై కర్రలు జారిపడి పొగాకు రైతు డాక అంజిరెడ్డికి చెందిన బ్యారన్‌కు నిప్పంటుకుంది. ఒక్కసారిగా పెద్ద మంటలు రావడంతో స్థానికులు అప్రమత్తం అయ్యారు. హుటాహుటీన ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. కానీ అప్పటికే బ్యారన్‌లోని పొగాకు మొత్తం పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది చొరువతో ప్రక్కనే ఉన్న జంట బ్యారెన్‌లోకి మంటలు వ్యాపించే లోపు కొంత మేరకు గ్రామస్తుల సహాయంతో పొగాకును బయటకు తీశారు. కానీ ఫలితం లేకుండా పోయింది. ఒక బ్యారెన్ పూర్తిగా దగ్ధమైపోగా రెండవ బ్యారన్ స్వల్పంగా ఆర్థిక నష్టం వాటిల్లినట్లు రైతు అంజిరెడ్డి తెలిపారు. అయితే ఆ రెండు జంట బ్యారెన్లు అద్దెకు తీసుకున్న సన్న కారు రైతు ఇప్పటికే అప్పులు చేసి పొగాకు పండించామని, ఈ సమయంలో చేతికి రావాల్సిన పొగాకు పంట తమ కళ్ళముందే కాలిపోవడంతో రైతు మొఖంలో నిరుత్సాహం ఏర్పడింది. ఈ సందర్భంగా బ్యారెన్ యజమాని డాక అంజిరెడ్డి మాట్లాడుతూ రెండు బ్యారెన్లను అదే గ్రామానికి చెందిన వద్దిముక్కల స్టీవెన్‌కు అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. అందులో ఒక బ్యారెన్ తో పాటు అందులో ఉన్న పొగాకు పూర్తిగా దగ్ధమైందన్నారు. మరో బ్యారెన్ మాత్రం మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన స్థానికులు పొగాకును పక్కకు తీసేశారన్నారు. ఈ మేరకు స్వల్పంగా ఆర్థిక నష్టం జరగగా మొత్తం రెండు జంట బ్యారెన్‌లపై అక్షరాల రూ.7లక్షలు ఆర్థిక నష్టం వాటిలినట్లు తెలిపారు.

## లింగసముద్రంలో రోడ్డుప్రమాదం - ఇరువురి మృతి



**లింగసముద్రం జనవరి 22, ప్రభాతవార్త**
మండలంలోని తాతా హోటల్ సెంటర్ నుంచి మొగిలిచర్ల రోడ్డులో గురువారం జరిగి రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు మృతిచెందారు. మొగిలిచర్లకు చెందిన పల్లాల రామ్మూర్తిరెడ్డి (60) లింగసముద్రం వైపు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఆర్‌ఆర్‌పాలెంకు చెందిన మాల్యాద్రి పొలంలో పనిముగించుకొని బైక్‌పై మొగిలిచర్లవైపు వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రామయ్య తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మాల్యాద్రిని వైద్యచికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. దీంతో ఆరెపాలెం, మొగిలిచర్ల గ్రామాల్లో విషాదం నెలకొంది.



### అజాతశత్రువు రామయ్య :
రామ్మూర్తిరెడ్డి మృతి మొగిలిచర్లలో విషాదం నెలకొంది. ఈయన మృతికి మాజీ మంత్రి మహీధర్‌రెడ్డితోపాటు పలువురు లింగసముద్రం మండలనేతలు రాళ్లపాడు కృష్ణారెడ్డి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరారు. మృతుడురామయ్య మండలపరిసర ప్రాంతాలలో ఆయన సుపరిచితుడు, సమాజం పట్ల అవగాహన కలిగిన వ్యక్తి. మొగిలిచర్ల ప్రముఖులు శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయ వ్యవస్థాపకుడు స్వర్గీయ పవని శ్రీధర్‌రావుకు సన్నిహితుడు. మాజీమంత్రి మహీధర్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు. విద్యుత్‌హెల్పర్‌గానూ, మొగిలిచర్ల రేషన్‌షాపు డీలరుగానూ పనిచేశారు. గ్రామంలో అజాతశత్రువుగా గుర్తింపు పొందారు. గ్రామాభివృద్ధిలో ఆయన గ్రామపెద్దలతో కలిసి కృషిచేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. ప్రస్తుతం గ్రామంలోని రామాలయ నిర్మాణపనులు నిర్వహిస్తున్నట్లు లింగసముద్రం రజకసంఘం నేత మావుటూరి బ్రహ్మయ్య అన్నారు. రు.రామయ్య మృతి గ్రామాభివృద్ధికి తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు.

## ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నియామకానికి కృతజ్ఞతలు



**సింగరాయకొండ, జనవరి 22, ప్రభాతవార్త**
మండలంలో దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాత సింగరాయకొండ శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నూతన ఆలయ ట్రస్ట్ బోర్డు నియామకానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులకు నూతనంగా నియమితులైన ట్రస్ట్ బోర్డు చైర్మన్ సన్నీ బోయిన శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కొండపి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు పెద్దాయన దామచర్ల పూర్ణచంద్రరావులను ట్రస్ట్ బోర్డు సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మంత్రి, ఎంపీ, మారిటైమ్ బోర్డు చైర్మన్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ సన్నీ బోయిన శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ కృష్ణవేణి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు నేరాలపై అవగాహన



**సింగరాయకొండ, జనవరి 22, ప్రభాతవార్త**
మహిళలపై జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ బి. మహేంద్ర సూచించారు. మండలంలోని ఉల్లపాలెం గ్రామంలో గురువారం డ్వాక్రా మహిళలకు మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ క్రైమ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ బి.మహేంద్ర మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు ఇవ్వకూడదని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ధైర్యంగా ముందుకు రావాలని ఆయన అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రజకులపై దాడులు పెరుగుతున్నాయి

**- ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి**

**- మాజీ రజక ఫెడరేషన్ డైరెక్టర్ కనిగిరి బాల వెంకటరమణ డిమాండ్**




**మార్కాపురం, జనవరి 22, ప్రభాతవార్త**
రాష్ట్రంలో రజకులపై ఇటీవలి కాలంలో దాడులు పెరిగిపోతున్నాయని, బలహీన వర్గాలకు చెందిన రజకులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాల్సిన అత్యవసర అవసరం ఉందని మాజీ రజక ఫెడరేషన్ డైరెక్టర్, సీనియర్ రజక సంఘ నాయకులు కనిగిరి బాల వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పామూరు మండలం బొట్లగూడూరు గ్రామంలో రజక యువకుడు చీమలదిన్నె మహర్షిపై జరిగిన అమానుష దాడిని ఖండిస్తూ మార్కాపురం పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న ప్రమాదాన్ని సాకుగా చేసుకుని రజక యువకుడిని నడిరోడ్డులో ఇనుప స్తంభానికి కట్టేసి చిత్రహింసలకు గురిచేయడం సభ్య సమాజం తలదించుకునే చర్యగా ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితుడికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో రజకులపై దాడులు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రజకులకు న్యాయం చేయాలని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయాలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ రజక సంఘ నాయకులు సురభి లక్ష్మయ్య, పోలిశెట్టి తిరుపతయ్య, టి సుబ్రహ్మణ్యం, పగడాల నారాయణ, సురభి తదితరులు పాల్గొన్నారు.

### బ్లడ్‌డొనేషన్ డ్రైవ్‌ను జయప్రదం చేయండి - ఆకుపాటి వెంకటేష్



**పామూరు, జనవరి 22, ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా నేడు(శుక్రవారం) ఎన్టీఆర్ ట్రస్టు సహకారంతో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అమరావతి గ్రౌండ్స్ నందు బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ తెలిపారు. రక్తదానం అంటేనే ప్రాణదానమని రక్తదానం చేయడం వల్ల ప్రాణాలు కాపాడిన వాళ్లమవుతాం అన్నారు.

### కటకానిపల్లి గ్రామంలో ఈ పంట నమోదు కార్యక్రమం పరిశీలన



**పెద్దదోర్నాల, జనవరి 22, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలంలోని కటకానిపల్లి గ్రామంలో ఈ పంట నమోదు కార్యక్రమంను మండల వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్‌నాయక్ గురువారం పర్యవేక్షణ చేయడం జరిగింది. అలాగే గ్రామంలో ఉన్న రైతులతో రైతు యాప్ చేపించి రైతులకు యాప్‌పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ పంట నమోదు ప్రతి రైతు సాగు చేసిన పంటలను గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామంలో ఉన్న అన్ని ల్యాండ్ పార్సెల్స్‌ను ఈ పంట యాప్ నందు నమోదు చేయడం జరుగుతుంది. అలాగే ఈ పంట చేసిన ప్రతి రైతుకి మెసేజ్ కూడా వారి యొక్క చరవాణి నంబర్‌కు వస్తుంది. రైతు కూడా ధృవీకరణ చేయాలి. కాబట్టి రైతులు అందరూ తప్పనిసరిగా 20.02.2026 కల్లా మీరు సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే భూమి ఉన్న ప్రతి రైతు కూడా రైతు యాప్‌ని డౌన్లోడ్ చేసుకుని వ్యవసాయ సమచారం, మార్కెట్ ధరలు, చీడ పీడల గురించి ఈ యాప్ నందు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.రాజేంద్ర ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

### వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తవ్వసాగర్‌రెడ్డి



**పామూరు, జనవరి 22, ప్రభాతవార్త**
ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనుటకు ఒంగోలు నుండి మూలవారిపల్లె వెళ్లే మార్గమధ్యలో రేగిచెట్లపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ పార్టీ యువ నాయకుడు తవ్వ సాగర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి పాల్గొన్నారు.

## ఈ-నారి, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం



**కొనకనమిట్ల, జనవరి 22, ప్రభాతవార్త**
కొనకనమిట్ల వెలుగు కార్యాలయంలో గురువారం ఈ - నారి, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం వెలుగు, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణలో జెండర్ ప్రజ్ఞత ప్రారంభించిన మన డబ్బులు మన లెక్కలు గురించి సమాజంలో సామాజిక అసమానతలు, అనక్స్‌రి 2 గురించి మన డబ్బులు, మన లెక్కలు యాప్‌లో పొదుపు లోన్లు, సీఐఫ్ ఉన్నతి మొదలైన లోన్స్ సంఘ సభ్యులు అన్ని వివరాలు రాయాలని ఏపీఎం బి.సుధాకరరావు వివరించారు. రాసిన వివరాలు మొబైల్ బుక్ కీపింగ్ యాప్ నందు వీఓఏలు నమోదు చేయాలన్నారు. మొదటి రోజు మర్రిపాలెం క్లస్టర్, పెద్దారికట్ల క్లస్టర్ వారికి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో సీసీలు సాయిలు, రమేష్‌బాబు, మండల సమైక్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, అకౌంటెంట్లు నాగమణి, అరుణ కుమారి, సీఆర్పీలు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు రక్షించుకోండి

**- మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు**



**కొనకనమిట్ల, జనవరి 22, ప్రభాతవార్త**
ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించుకోవాలని అప్పుడే ప్రాణాలను రక్షించుకోవచ్చని మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏ.మాధవరావు అన్నారు. 37వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రం కొనకనమిట్లలో ఎస్సై శ్రీకాంత్‌తో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధారణ మన ప్రాణాలకు రక్షణ, ఓవర్ స్పీడ్ వలన చాలా మంది యువత ప్రమాదాలకు గురి అవుతున్నారన్నారు. ఈ ప్రమాదాలలో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, మీ తల్లిదండ్రులు మీ మీద ఎంతో ఆశలు పెట్టుకుంటారని, రోడ్డు భద్రతలు పాటించాలని కోరారు. జీవితంఎంతో విలువైందని, అలాగే భవిష్యత్తు బాగుండాలి, నీకు ఏదైనా ప్రమాదం వల్ల మీ ప్రాణాలు కోల్పోతే మీ తల్లిదండ్రులు మీ కుటుంబం ఆర్థికంగా చితికి పోతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తారని, ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ చేయకూడదని, కార్ డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై శ్రీకాంత్ రోడ్డు భద్రత గురించి వాహనదారులకు వివరించారు.

### చేకూరి లక్ష్మమ్మ సంస్మరణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కందుల



**కొనకనమిట్ల, జనవరి 22, ప్రభాతవార్త**
కొనకనమిట్ల మండలం చినమనగుండం గ్రామంలో టీడీపీ నాయకులు చేకూరి చెన్నకేశవులు మాతృమూర్తి లక్ష్మమ్మ సంస్మరణ కార్యక్రమానికి గురువారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మూరబోయిన బాబురావు, వెలుగొండ ఆలయ చైర్మన్ కుందురు కాశిరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖదేవ్(బూన్), నాయకులు పరిటాల సుబ్బయ్య, చప్పిడి రాజేష్, రాహుల్, కోల్ల కోటేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గ్రామీణ కార్మికుల ఉపాధిని దెబ్బతీసే కుట్ర : సీపీఎం ఆగ్రహం



**మార్కాపురం, జనవరి 22,ప్రభాతవార్త**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్రేగా)ను కొనసాగించాలని, కార్మికుల ఉపాధిని దెబ్బతీసే విబిజి-రాంజీ పేరుతో తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం 22వ తేదీన పెద్దారవీడు మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దగ్గుపాటి సోమయ్య ఆధ్వర్యంలో గ్రామంలో విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీలను ఉద్దేశించి దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం 90శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10శాతం ఖర్చు భరించే విధంగా ఉన్న ఎంఎన్రేగా చట్టాన్ని మార్చి, కేంద్రం తన వాటాను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం వల్ల భవిష్యత్తులో ఈ చట్టం అమలే కష్టమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇది గ్రామీణ పేదల ఉపాధి అవకాశాలను తగ్గించడానికే కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రగా విమర్శించారు. కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూనే, పేదలపై చేసే ఖర్చును క్రమంగా తగ్గిస్తున్నారని ఆరోపించారు. వెంటనే కొత్త చట్టాన్ని రద్దు చేసి, పాత ఎంఎన్రేగా చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పెద్దారవీడు మండల శాఖ సభ్యులు వెన్న కాశిరెడ్డి, మూడమంచు సుబ్బయ్య, అల్లు వెంకటరెడ్డి, అల్లు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలి



**రాచర్ల, జనవరి 22, ప్రభాతవార్త**
వాహనదారులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ తమ వాహనాలను నడపాలని రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఫారం బస్టాండ్ సెంటర్లో గురువారం ఆయన తమ సిబ్బందితో వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. వాహనదారులు ఎవరైనా వాహనాలపై పోలీసు లేదా ప్రెస్ అని స్టిక్కర్లు వేసుకుంటే అందుకు సంబంధించిన ఆధారాలు చూపించాలని లేనిపక్షంలో అలా వేసుకున్న వాహనాల దారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి వాహనాలను నడపాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు

### 100 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంఈఓ గిరిధర శర్మ



**రాచర్ల, జనవరి 22, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన రాచర్లలోని రాచర్ల జడ్పీ హైస్కూల్లో జరుగుతున్న వంద రోజులు యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని గురువారం మండల విద్యాశాఖ అధికారి వి గిరిధర శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుండే పది పరీక్షలపై దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధ్యాయులు వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాల వైపు అడుగులు వేసేలా కృషిచేయాలన్నారు. ఎంఈఓ వెంట క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు బిఎల్ రామా నాయక్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# తమ్మనేని కొండారెడ్డికి కన్నీటి నివాళి

## - ఎమ్మెల్యే ఉగ్ర శ్రద్ధాంజలి



**కనిగిరి, జనవరి 22, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణ పరిధిలోని కొత్తూరుకు చెందిన తమ్మనేని కొండారెడ్డి(47) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సామాజికంగా చురుకుగా వ్యవహరిస్తూ అందరితో ఆప్యాయంగా మెలిగి స్నేహబంధాలు పెంచుకున్న కొండారెడ్డి అకస్మాత్తుగా మృతి చెందడం కనిగిరి పట్టణం మొత్తానికి తీవ్ర షాక్ ఇచ్చింది. ఎప్పుడు చిరునవ్వుతో ఉంటూ, ఎవరికి కష్టం రాకుండా చూసుకునే సౌమ్యుడు, హృదయవంతుడు, అందరికి సాయం చేయడానికి ముందుండే వ్యక్తిగా పేరు తెచ్చుకున్న కొండారెడ్డి మృతి వార్త వినగానే స్నేహితులు, అభిమానులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున కొత్తూరుకు చేరుకున్నారు. అనేక మంది 'ఇంత మానవతా హృదయంతో ఉన్న వ్యక్తి ఇంత త్వరగా మాయమవుతాడని నమ్మలేకపోతున్నాం' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం కొత్తూరుకు వెళ్లి కొండారెడ్డి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కొండారెడ్డి కనిగిరిలో అందరి మనసులో చెరగని ముద్ర వేసిన మంచి మనిషి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని కోరుకుంటున్నాను అని ఎమ్మెల్యే ఉగ్ర అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, తమ్మినేని సురేంద్రరెడ్డి, అచ్చాల రవి, పుట్లూరి కృష్ణారెడ్డి, పిల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, జి.రామకష్ణ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు. గ్రామస్తులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై కుటుంబానికి సాంత్వన తెలిపారు. కొత్తూరు గ్రామం అంతా విషాద వాతావరణంలో మునిగిపోయింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా ప్రజలు తరలి వచ్చి కొండారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. చిన్న వయసులోనే గుండెపోటు భారిన పడి ప్రాణాలు కోల్పోవడం అందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన మృతితో గ్రామంలో ఒక మానవతా మనిషిని కోల్పోయినట్టే అని పలువురు స్పందించారు.

## సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శించిన వైవీ సుబ్బారెడ్డి





**కనిగిరి, జనవరి 22, ప్రభాతవార్త**

రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కనిగిరిలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్‌కు చెందిన సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పెరుగు మురళీకృష్ణ– హరిత వైద్య దంపతులు ఘనంగా ఆహ్వానం పలికారు. నూతనంగా నిర్మించిన ఈ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య విభాగాలు, ఆధునిక సౌకర్యాలపై డాక్టర్ పెరుగు మురళి కృష్ణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా తీసుకున్న చర్యలను పరిశీలించారు. కరోనా కాలంలో కనిగిరి ప్రాంతంలో డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ అందించిన సేవల గురించి పలువురు నాయకులు వైవీ సుబ్బారెడ్డికి వివరించారు. ఆ సమయంలో ప్రజలకు అందిన వైద్య సేవలు కీలకంగా నిలిచాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైవీ భద్రారెడ్డి, ఒంగోలు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, రాష్ట్ర కార్యదర్శులు కేవి రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కేవి ప్రసాద్, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ వెంకయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ సరిత, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, గాయం బలరామిరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, బొర్రారెడ్డి, ఓకే రెడ్డి, జయ రాములురెడ్డి, నరసింహారెడ్డి,వైస్ ఎంపీపీ నగేష్, న్యాయవాది శ్రీనివాసులరెడ్డి, యాకంటి శ్రీనివాసరెడ్డి, రామనబోయిన శ్రీనివాసులు, పులి శ్రీను, గంజి రవీంద్రరెడ్డి, మణికంఠరెడ్డి, కళ్యాణ్, మహేంద్ర, వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి,నరాల కొండారెడ్డి, మోడీ నారాయణ, గిద్ద తిరుపతయ్య, మేడిబోయిన నారాయణ, కొండయ్య, వెంకట కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వాదాలతో అక్షింతలు

## - చింతగుంట్ల వివాహ వేడుకల్లో దద్దాల పెద్ద మాలకొండయ్య



**కనిగిరి, జనవరి 22, ప్రభాతవార్త**

కనిగిరి టౌన్ 12వ వార్డు పాతూరులో గురువారం జరిగిన మాజీ ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్ రాజు అన్న కుమారుడు చింతగుంట్ల కిషోర్– సలోమి వివాహ వేడుకలో కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ తండ్రి దద్దాల పెద్ద మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, సయ్యద్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాల బాలికలకు దుప్పట్లు వితరణ



**సంతమాగులూరు, జనవరి 22, ప్రభాతవార్త**

సమాజంలో అత్యున్నత వ్యక్తిగా గుర్తింపు పొందిన కుమారుడు తన తండ్రి జ్ఞాపకార్థం గా సమాజం లో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అ క్రమంలోలోనే మండలంలోని ఏల్చూరు గ్రామం లో వున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి దాతృత్వంతో దుప్పట్లు పంపిణీచేశారు. గురువారం ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కె.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో మండలం లోని గురిజెపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది గిరిరాజు నాగేశ్వరరావు కస్తూర్బా బాలికల విద్యాలయం లోని బాలికలకు దుప్పట్లు ను ఉచితం గా పంపిణి చేసారు. ఈ సందర్భంగా విద్యాలయానికి వెళ్లిన న్యాయవాది గిరిరాజు నాగేశ్వరరావు తో పాటు వెళ్లిన వెన్నపూస జోసఫ్ రెడ్డి, కొలిశెట్టి శ్రీనివాసరావు, దుద్దెల చిన్నగాలయ్య లకు విద్యార్థులు పూలతో స్వాగతం పలికారు. న్యాయవాది, దాతనాగేశ్వరరావు తన తండ్రి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం 290 దుప్పట్లను సొంత నిధులను వెచ్చించి సమకూర్చారు. వాటిని సంతమాగులూరు మండల విద్య శాఖ అధికారులు వేమవరపు కోటేశ్వరరావు, దార్ల దినేష్ కుమార్ సమక్షంలో 250 మంది బాలికలు, సిబ్బందికి అందజేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ విద్య ద్వారా క్రమశిక్షణ, విధేయత వంటి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని, వారి విజయగాథలను ప్రేరణగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దాతనాగేశ్వరరావు మాట్లాడుతూ కేజీబీవీ విద్యాలయంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గతంలో ఇదే పాఠశాల ముఖద్వారం నిర్మాణం కోసం తనవంతు 70 వేల రూపాయలు సమకూర్చినట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి తనవంతు చేయూత ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. అనంతరం పాఠశాల టీచర్లు,విద్యార్థినులు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యం ఈ ఓ వేమవరపు కోటేశ్వరరావు, రెండవ యం ఈ ఓ దార్ల దినేష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయనీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతి



**అద్దంకి, జనవరి 22,ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో, గురువారం స్థానిక రోటరీ కార్యాలయంలో తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమనేత, సంఘ సంస్కర్త,గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగురామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి,తెలుగు వ్యవహారిక భాషకు ఆయన చేసిన సేవలు స్మరించుకున్నారు. గిడుగు వారి వలనే తెలుగు విద్య సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చినదని పూర్ణ చంద్రరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, కార్యదర్శి అళహరి హరిప్రసాదరావు, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు,అద్దంకి లేవిప్రసాద్,చప్పిడి వీరయ్య,నరసింహారావు,సందిరెడ్డి శ్రీనివాసరావు,పువ్వాడ రామకోటేశ్వరరావు, పసుపులేటి ఆంజనేయులు,లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునార్ధరించాలి సిపిఎం డిమాండ్



**అద్దంకి, జనవరి 22,ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు పేద రైతులకు వృత్తిదారులకు పని కల్పించి సమ్మర్ టైంలో ఎంతో కొంత ఆసరాగున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం బిజెపి నరేంద్ర మోడీ రద్దు చేసి గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీ పేద రైతు ఉత్తిదారుల పొట్టగొట్టే విధానాన్ని అవలంబిస్తుంది అని సిపిఎం పార్టీ అద్దంకి కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు తెలియజేశారు. 2005లో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వం వామపక్షా పార్టీల డిమాండ్ ఫలితంగా కామన్ మినిమం ప్రోగ్రాం లో భాగంగా, వామపక్ష పార్టీల కృషితో 2005లో ఈ పథకం వచ్చింది ఆ స్థానంలో తెచ్చిన కొత్త చట్టం ఉపాధి హామీ హక్కులను దెబ్బతీస్తుంది కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం రాష్ట్రంలో 71 లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు అత్యధిక మంది కూలీలు పేద రైతులు ఈ పథకంలో పని చేస్తా ఉన్నారు. ఈ పథకం వచ్చిన అనంతరం గ్రామీణ ప్రాంతంలో కూలీలకు ఎంతో కొంత వ్యవసాయ పనుల్లో కూలి పెరిగిన పరిస్థితి అనివార్యంగా వచ్చింది. బిజెపి ప్రభుత్వం వికసిత్. భారత్. గ్యారెంటీ. రోజ్ గార్. అజీవిక. మిషన్. (గ్రామీణ) జి రామ్ జి పేరుతో కొత్త చట్టాన్ని తెచ్చింది ఈ చట్టంలో ఉపాధి హామీ పథకంలో గత చట్ట ప్రకారం కేంద్ర ప్రభుత్వం 90 నిధిలిస్తే రాష్ట్ర ప్రభుత్వం 10 భరించేవి కానీ ఇప్పుడు 60 కేంద్ర ప్రభుత్వం 40 రాష్ట్రప్రభుత్వం భరించాల్సి న పరిస్థితి వచ్చింది. 125 రోజులు కి పెంచుతున్నట్టు ప్రచారం చేస్తున్న కానీ ఆచరణలో ఈ స్కీమ్లో 60 రోజులు పనులు తప్పితే వంద రోజులు కూడా చేయనటువంటి పరిస్థితి ఉంది పని గ్యారంటీ లేకుండా చట్టంలోని సవరణ చేశారు ప్రత్యేకమైనటువంటి పరిస్థితిలో ఆ ప్రాంతంలో పని రెండు పూటలా మాస్టర్ విధానాన్ని తీసుకొచ్చారు, పని గ్యారంటీ లేకుండా ఇస్తేనే పని అనే విధంగా చట్టం తీసుకురావడం జరిగింది మోడీ తెచ్చిన 2025 చట్టాన్ని రద్దు చేయాలని 2005లో తెచ్చిన చట్టాన్ని పునర్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ప్రచారలో భాగంగా గురువారం వాల్ పోస్టర్ ఆవిష్కరణ ఇంటింటికి ప్రచారలో భాగంగా చెరువు కొమ్ము పాలెం గ్రామంలో ప్రచార క్యాంపెయిన్ నిర్వహించి కూలీలతో రైతులతో మాట్లాడారు. రాబోయే కాలంలో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునే దానికోసం జరిగే ఆందోళన పోరాటాల ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని సిపిఎం పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు పొనక రామాంజనేయులు. ఎస్ కె కరీమ్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నేరం, వారి భవిష్యత్తును కాపాడుదాం

### - సి డి పి ఓ, ఎం. ఎలిజిబెత్ రాణి



**కొరిసపాడు, జనవరి 22,ప్రభాతవార్త**

బాల్యవివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం బాల్యవివాహాలు జరుపరాదని, అటువంటి వివాహాలకు పాల్పడిన తల్లిదండ్రులు ,పాల్గొన్న బంధువులు శిక్షార్హులని కొరిసపాడు ,సిడిపిఓ, ఎం. ఎలిజిబెత్ రాణి తెలియజేశారు. గురువారం మండల సిడిపిఓ ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దాట్ల కోటేశ్వరరావు, కార్యాలయ సిబ్బందితో కలిసి బాల్య వివాహం చట్టరీత్యా నేరం వాల్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలకు పాల్పడినవారు దోషులుగా నిరూపణ అయితే వారికి న్యాయస్థానాలు రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తాయన్నారు. 18 సంవత్సరాలు లోపు బాలికలకు, 21 సంవత్సరాలు నిండని బాలురకువివాహాలు చేసిన ఎడల పిల్లల విద్య ,ఆరోగ్యం, మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు చూపుతాయన్నారు.ఎట్టి పరిస్థితులలోనూ బాల్యవివాహాలు చేయరాదని మేజర్లై వారు జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాలకు పాల్పడిన తల్లిదండ్రులు, సంరక్షకులు ,మధ్యవర్తులు, వివాహం జరిపిన పూజారులు కూడా చట్ట ప్రకారం శిక్షార్హులు అన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్న సమాచారం తెలిసినట్లయితే బాధ్యతగా పౌరులు సమీప పోలీస్ స్టేషన్కు కానీ 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కానీ సంబంధిత అధికారులకు సమాచారం అందించి, బాల్యవివాహాలను అరికట్టి పిల్లల హక్కులను కాపాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు సూపర్వైజర్లు కే రమాదేవి, ఎన్ పద్మజ ,ఇందిర,సిబ్బంది ఎం సునీత, కే లక్ష్మణ్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై అవగాహన సదస్సు



**వేటపాలెం, జనవరి 22, ప్రభాతవార్త**

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కళాశాల జాతీయ సేవా విభాగం(ఎన్ఎస్ఎస్) వారి ఆధ్వర్యంలో రహదారి భద్రతపై సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీ నందు విద్యార్థులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సదస్సుకు బాపట్ల జిల్లా ఆర్టీఓ, టికె పరంధామరెడ్డి ముఖ్య అతిధిగా కాగా చీరాల మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ బి.రామకృష్ణారెడ్డి, బి.రవి నాయక్, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్, షాడోస్ సేవా సంస్థకు చెందిన రాజా సాల్మన్, డాక్టర్ నరేంద్రలు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా ఆర్టీఓ టికె పరంధామరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మోటార్ వెహికల్స్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, సరియైన డ్రైవింగ్ లైసెన్సు ను కలిగి ఉండాలని తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేయరాదని, అతి వేగంగా వాహనాలను నడపరాదని తెలిపారు. డ్రైవింగ్ చేసేటప్పుడు చేసే చిన్న తప్పులే సరిదిద్దుకోలేని ప్రమాదాలకు కారణం అవుతాయి అని తెలిపారు. చీరాల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వాహనదారులు మద్యాన్ని సేవించి వాహనాలను నడపరాదని, రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించి తీరాలని తెలిపారు. షాడోస్ సేవా సంస్థకు చెందిన రాజా సాల్మన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు రహదారి ప్రమాదాలను గూర్చి అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో చీరాల పరిసర ప్రాంతాలలో జరిగిన రహదారి ప్రమాదాలకు చెందిన ఫొటోలను ప్రదర్శించి దానికి గల కారణాలను వివరంగా తెలిపారు. డాక్టర్ నరేంద్ర వాహన ప్రమాదాలలో గాయపడిన వ్యక్తులకు సీపీఆర్ ఎలా చేయాలి, దానిని చేసేటప్పుడు తీసుకోవాల్సి న జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపి దాని గురించి అవగాహన కల్పించారు. ఆర్టీఓ టికె పరంధామరెడ్డి విద్యార్థులచే రహదారి భద్రత ప్రమాణాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ, టికె పరంధామరెడ్డి అతిధులుగా విచ్చేసిన వారికి కళాశాల యాజమాన్యం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ లక్ష్మణరావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.జ్యోతి స్వరూప్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మించాల



**చీరాల టౌన్, జనవరి 22, ప్రభాతవార్త**

చీరాల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల శాసనసభ్యులు మద్దులూరు మాలకొండయ్య ఆదేశాల ప్రకారం చీరాల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు గొల్లపాలెం 15వ వార్డు, 19వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ చుక్క నాగలక్ష్మీ, 15వ వార్డ దాసరి రామకృష్ణ, మున్సిపల్ డీఈఈ రఘురాం, ఏఈ రవికుమార్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక వార్డు నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

### - డాక్టర్ వేణుగోపాల్





**చీరాల టౌన్, జనవరి 22, ప్రభాతవార్త**

పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.వేణుగోపాల్ అన్నారు. స్థానిక చీరాల విజయ నగర కాలనీ సాల్మన్ సెంటర్ పంచాయతీలో గురువారం శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజరైన ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుండి 31వ తేదీ వరకు అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమాల లో పశువుల కోసం గోకులం షెడ్లు నిర్మాణానికి అందుతున్న సబ్సిడీ రుణాలు, పవు కిషన్ క్రెడిట్ కార్డులు పథకాల ప్రాముఖ్యతను రైతులకు వివరించడం జరుగుతుందని ఆయన అన్నారు. అదే విధంగా చీరాల ఏరియా పశువు అయితే చాలా సహాయక సంచాలకులు డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సకాలంలో వైద్యం అందించడం ద్వారా నష్టాలను నివారించవచ్చని ఆయన తెలిపారు. అదే విధంగా పశువుల ప్రమాద బీమా పథకం 80శాతం సబ్సిడీతో అమల్లోకి వచ్చిందని రైతులందరూ ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని గొర్రెలు, మేకలు, పెపకం దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ వై.పావని, డాక్టర్ పుష్పలత, సిబ్బంది పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణాల పూర్తి వేగవంతం చేయాలి

### - గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు చరిత్రలో నిలిచేలా ఉండాలి - జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

### - కలెక్టరేట్ పనుల్లో నిర్లక్ష్యానికి తావులేదు





**మార్కాపురం, జనవరి 22, ప్రభాతవార్త**

కలెక్టరేట్ ప్రాంగణంలో చేపట్టిన అన్ని నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులుతో కలిసి కలెక్టరేట్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న ఆయన, ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే సమయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. అన్న క్యాంటీన్ల సేవలు, మహిళలపై నేరాల నియంత్రణ, గంజాయి ఇతర మాదకద్రవ్యాల కట్టడి, మున్సిపల్ సేవలు, పారిశుధ్యం, సంక్షేమ హాస్టళ్ల సదుపాయాలపై జిల్లావారీగా సమీక్ష జరిగింది. ప్రజలకు సానుకూల అభిప్రాయం కలిగేలా పాలన సాగాలని సీఎస్ సూచించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించే ఎస్‌వికెపి కళాశాల మైదానాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. జిల్లా ఆవిర్భావం తర్వాత తొలి గణతంత్ర వేడుకలు కావడంతో అవి చరిత్రలో నిలిచేలా వైభవంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే 26వ తేదీ సాయంత్రం సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగే తేనీటి విందు ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు కూడా కలెక్టర్‌ను కలిసి స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

## మార్కాపురం జిల్లా ఎస్పీ కార్యాలయ పునరుద్ధరణ పనులు ప్రారంభం



**మార్కాపురం, జనవరి 22 ,ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పునరుద్ధరణ పనులను డీఎస్పి నాగరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదుబాబు, కాంట్రాక్టర్ భీమవరం వెంకటేశ్వర రెడ్డి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పి నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు కార్యాలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధి అవసరమన్నారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులు నాణ్యతతో, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని డీఎస్పీ సూచించారు. పనుల పర్యవేక్షణను ఎస్ఐ సైదుబాబు నిర్వహించనుండగా, కాంట్రాక్టర్ భీమవరం వెంకటేశ్వర రెడ్డి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యాలయ అభివృద్ధితో పోలీసు సిబ్బంది పనితీరు మెరుగుపడడంతో పాటు ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## గణతంత్ర వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు



**మార్కాపురం, జనవరి 22, ప్రభాతవార్త**

మార్కాపురంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గురువారం పరిశీలించారు. వేడుకలు జరగనున్న ఎస్‌వికెపి కళాశాల మైదానాన్ని సందర్శించిన వారు, ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా ఆవిర్భావం అనంతరం తొలిసారిగా నిర్వహించనున్న గణతంత్ర దిన వేడుకలు చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.జాతీయ పతాకావిష్కరణ,పరేడ్,సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం అక్కడ నిర్వహించనున్న తేనీటి విందు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు.

## లక్ష్యాలను అధిగమించాలి - ఎంపీడీవో శంకరరావు



**వలేటివారిపాలెం, జనవరి 22, ప్రభాతవార్త**

మండలంలోని బడేవారిపాలెం గ్రామ సచివాలయంను ఎంపీడీవో వై.శంకరరావు గురువారం తనిఖీ చేశారు. చుండి సచివాలయం పరిశీలన, ఇంటి పన్నులు వసూళ్ళు, ఎఫ్ఎస్ సర్వే, సిటిజన్ ఈకేవైసీ తదితర వాటిని గురించి సదరు సర్వేలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటి పన్ను వసూళ్లలో చాలా వెనుకబడి ఉన్నారని, ప్రజలు అందుబాటులో ఉన్న సమయంలో ఇళ్ల వద్దకు వెళ్లి వసూళ్ళ చేయాలని సిబ్బందికి సూచించారు.

### మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలి - ఎంపీడీవో శంకరరావు



**వలేటివారిపాలెం, జనవరి 22, ప్రభాతవార్త**

విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని వంటలు రుచికరంగా అందిస్తున్నారని ఎంపీడీవో వై.శంకరరావు అన్నారు. స్థానిక బీసీ హాస్టల్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను భోజనం, వసతి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ ఎల్ఈడీ లైట్లు, వెలుగులో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. టాయిలెట్స్, హాస్టల్ స్టోర్, కిచెన్ విద్యార్థుల రూములను పరిశీలించారు. 39 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నారాయణరావు, హాస్టల్‌వార్డెన్ మాల్యాద్రి ఉన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### - సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీ



**లింగసముద్రం, జనవరి 22, ప్రభాతవార్త**

రైతు శ్రేయస్సు దృష్ట్యా భూ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వంకృషి చేస్తుందని కందుకూరు కలెక్టర్ దామెర హిమా వంశీ తెలిపారు. లింగసముద్రం మండలంలోని జంపాలవారిపాలెం పట్టాదారు పాస్ బుక్ పంపిణీ గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే జరిగిన భూములలో రైతుల పాస్ పుస్తకాల పంపిణీ చేశామని తెలిపారు. ఈ పాస్ పుస్తకాలలో ఏవైనా తప్పులుంటే అధికారులకు తెలియజేయాలన్నారు. ఈకేవైసీ ఎలా జరుగుతుందని పరిశీలించడానికి కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమవంశి లింగసముద్రం మండలానికి పరిశీలనకు వచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు మండల తహసీల్దార్ హనుమయమ్మ, ఆర్ఐ రమణయ్య, సర్వేయర్ వెంకటేశ్వర్లు టీములుగా ఏర్పడి ఈకేవైసీ చేయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాచర్లలో ఈ - నారి, సిఆర్‌పిలకు శిక్షణ కార్యక్రమం




**రాచర్ల, జనవరి 22 ప్రభాతవార్త**

రాచర్ల సచివాలయంలో ఈ–నారి, సీఆర్పీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఓ ఎస్ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ ఒక్కొక్క సిఆర్పీకి 10గ్రూపులు అప్పచెప్పి ఐదు అంశాల మీద బాధ్యతలు అప్పగించడం జరుగుతుందన్నారు. వారు సంస్థాగత నిర్మాణం, మానవ అభివృద్ధి, లింగ అసమానతలు తొలగించడం, బ్యాంక్ లింకేజీ, వ్యవసాయ వ్యవసాయేతర కార్యక్రమాలపై నెలలో 8 రోజులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. చేసిన పని వివరాలు సిసి, ఏపిఎం లాగిన్ లో నమోదు అవుతాయని వాటిని పరిశీలించి పనికి తగ్గ గౌరవ వేతనం సిఆర్పి లకు అందించడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలను సంప్రదించి మొబైల్ బ్యాంకు లింక్ ఆర్థిక లావాదేవీల నమోదు గ్రామ సంఘాల పరిధిలోని ఎస్‌హెచ్‌జి మహిళలకు జీవనోపాదుల కల్పన అంశాలపై అవగాహన కలిగి విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కె నరేష్, సీసీలు వెంకటయ్య, కృష్ణయ్య, అకౌంటెంట్ రాజకుమారి, వివోఏలు, సమాఖ్య ఆఫీస్ బేరర్స్, డి విజయలక్ష్మి, ఈ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

